రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కరపత్రాలతో బీఆర్ఎస్ నేతలు

మల్లన్న బ్లాక్‌మెయిలర్

- అతడిని గెలిపిస్తే ప్రజాస్వామ్యానికి చేటు
- రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి..
- రాష్ట్ర జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్

పెద్దవంగర, మే 20 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్లాక్‌మెయిలర్ మల్లన్నను గెలిపిస్తే ప్రజాస్వామ్యానికి చేటని జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వరంగల్- నల్లగొండ- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఓ బ్లాక్‌మెయిలర్ అని.. మీడియా ముసుగులో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతూ అక్రమాలు చేశాడని, అతడిని గెలిపిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకమన్నారు. విద్యావంతులంతా నిజాయితీపరుడైన రాకేశ్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్‌కుమార్, నేతలు యాదగిరిరావు, సుధీర్‌కుమార్, సమ్మ య్య, వెంకన్న, భాస్కర్‌రావు, శ్రీను, హరీశ్‌యాదవ్, రామూర్తియాదవ్, అనుదీప్, దయాకర్, వెంకటేశ్, భిక్షపతి, శంకర్ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

డోర్నకల్, మే 20: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని క్రికెట్ పోటీలకు ట్రోఫీ దాత పోడేటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం తోడేళ్లంగూడెం గ్రామంలో కుంట కింగ్స్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోడేటి శ్రీనివాస్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. వేసవిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజయ్య, తేనె బ్రహ్మయ్య, చింతకాయల మనోజ్, కార్యదర్శి సాయి తేజ, ఆర్గనైజర్స్ వెంకట్, శివ, అబ్బు, మహేశ్, చరణ్, అరవింద్, ఆదర్శ్, రాజు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందకనే అశోక్ మృతి

బంధువుల ఆందోళన

గార్ల, మే 20: సకాలంలో వైద్యం అందకనే అశోక్ మృతి చెందాడని అతడి కుటుంబ సభ్యులు, బంధువులు గార్ల మండలకేంద్రంలోని సీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేపట్టారు. వెంకటాపురం తండాకు చెందిన ఇస్లావత్ అశోక్ ఆదివారం రాత్రి తీర్లాపురం వద్ద రోడ్డు ప్రమాదానికి గురికాగా, కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. అయితే సీహెచ్‌సీలో వైద్యులు లేక, సకాలంలో వైద్యం అందక అశోక్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు, వైద్యులు ఆరోపిస్తున్నారు. ఆదివారం రాత్రి 7నుంచి అర్ధరాత్రి వరకు ఆందోళన చేపట్టారు. గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు.

23న బీఆర్ఎస్ సమావేశం

డోర్నకల్, మే 20 : మరిపెడ బంగ్లా భార్గవి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 23 సాయంత్రం 4 గంటలకు మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పట్టభద్రుల సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు, పట్టభద్రులు పెద్ద ఎత్తున హాజరు కావాలని మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ తెలిపారు. సోమవారం డోర్నకల్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీ, గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పట్టభద్రులను తీసుకొని సమావేశానికి హాజరు కావాలన్నారు.

పాఠశాల పనుల పరిశీలన

నర్సింహులపేట, మే 20: మండలంలోని పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీడీవో శ్రీను సోమవారం పరిశీలించారు. అజ్మీరాతండా, లాలితండా, పూసలితండా, ఇల్లందకుంటతండా, బోడ్డితండా, ముంగిముడుగు పాఠశాలలను సందర్శించిన ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్, నీటి సౌకర్యం, మూత్రశాలల మరమ్మతు పనులను ఈ నెల 30 వరకు పూర్తి చేయాలన్నారు. సీఆర్పీలు శేషుకుమార్, నాగేశ్వర్‌రావు, సీసీలు సత్యనారాయణ, నర్సయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

కౌంటింగ్ ప్రక్రియపై సమీక్షిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, మే 20 : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు, ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. 7 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, పోలింగ్ కేంద్రాలను బట్టి లెక్కింపునకు టేబుల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బందిని నియమించి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సైతం టేబుల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కంప్యూటర్లు, ప్రింటర్స్ మెటీరియల్ అందుబాటులో ఉంచాలని మేనేజ్‌మెంట్‌ను నోడల్ అధికారికి సూచించారు. ఓట్ల లెక్కింపు హాళ్లలో బారికేడింగ్ పనులు చేట్టాలన్నారు. సిబ్బంది, పోలింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశించేలా సూచిక బోర్డులు, పాత్రికేయుల కోసం మీడియా సెంటర్‌లో ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని పరిశీలించాలని, అధికారుల ఫోన్ల భద్రపరిచేందుకు కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 27న జరిగే వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికల్లో జిల్లాలోని 34,933 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, 36 పోలింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 58 బ్యాలెట్ బాక్సులను పోలింగ్‌కు సిద్ధం చేయాలని తెలిపారు. తొర్రూరులో జడ్పీహెచ్ఎస్, మహబూబాబాద్‌లో ఫాతిమా హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, డిప్యూటీ సీఈవో నర్మద, మత్స్యశాఖ అధికారి నాగమణి, డీఏవో హరిప్రసాద్, సీపీవో సుబ్బారావు, డీడీ గ్రౌండ్ వాటర్ అధికారి సురేశ్, ఏడీ సర్వేల్యాండ్స్ అధికారి నర్సింహమూర్తి, తహసీల్దార్లు సైదులు, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

గార్ల, మే 20 : వర్షాకాలంలో సాగుకు జీలుగు, జనము, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... రైతులకు సబ్సిడీతో జనము, జీలుగు, వరి విత్తనాలు అందిస్తామని, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్‌తో ప్రాథమిక వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

సహా ఉద్యోగి మృతిపై సంతాపం

బయ్యారం, మే 20: మండల పరిషత్ కార్యాలయ సహాయకురాలుగా పని చేస్తున్న అంజమ్మ (49) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా, సోమవారం కార్యాలయ ఉద్యోగులు నివాళులర్పించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో నరేశ్, సిబ్బంది దైవాదీనం, కృష్ణ, గౌసొద్దీన్‌చ శిరిష పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి జాతర

తొర్రూరు, మే 20 : మండలంలోని గుర్తూరు గ్రామంలోని గంగ పుత్రులు గంగమ్మతల్లి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. జల బిందెలు, మంగళహారతులతో డప్పు చప్పుళ్ల నడుమ ఆట పాటలతో నృత్యం చేస్తూ దేవాలయం వద్దకు చేరుకున్నారు. గంగమ్మ తల్లి విగ్రహాలను శుద్ధి చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటీ, గంగపుత్ర సంఘం ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల గోడ

దంతాలపల్లి, మే 20: పెద్దముప్పారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ప్రహరీని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో కూలిపోయిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామం నుంచి రాత్రిపూట అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నదని, ఇసుక ట్రాక్టర్ ఢీకొనడం వల్లే పాఠశాల గోడ కూలిపోయి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

వాహనం ఢీకొట్టడంతో కూలిపోయిన పాఠశాల గోడ

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శాంతకుమారి

- హరితహారం మొక్కలను రక్షించాలి
- సామాజిక తనిఖీలో ఏపీడీ

మహబూబాబాద్ రూరల్, మే 20 : విధుల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు అప్రమత్తంగా ఉండాలని ఏపీడీ శాంతకుమారి సూచించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని 9 గ్రామాలకు సంబంధించిన సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. సింగారం, రెడ్యాల, లక్ష్మీపురంతండా, గుండాలగడ్డ, ఇస్లావత్‌తండా, సాదుతండా, సోమ్లాతండా, లక్ష్మాతండా, సంద్రాళ్లగూడెం గ్రామాల్లో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు కేవలం 70శాతం మాత్రమే బతిగాయని, మిగతా 30 శాతం ఎండిపోయాయన్నారు. ఎండిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి కూలీలకు వసతులు కల్పించడం లేదని తనిఖీల్లో వెల్లడైనట్లు తెలిపారు. కూలీలకు టెంట్, తాగునీటి సదుపాయం, కిట్లను అందజేయాలన్నారు. జీపీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ మండలంలో 80 వర్క్‌లు చేయగా, వాటికి కేవలం 35 రికార్డులనే అందజేశారని, మిగతావి చూపించలేదన్నారు. గ్రామాల్లో పనుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఏపీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీలు కుమార్, నాగరాజు, ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు.

పోలీస్ పహారాలోనే ఇసుకదందా

- ప్రజాప్రతినిధుల అండదండలు
- ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి, వెంకట్‌రెడ్డి

నెల్లికుదురు, మే 20 : నిబంధలనకు విరుద్ధంగా పోలీస్ పహారాలోనే ఇసుక దందా జోరుగా సాగుతున్నదని ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని ఆకేరువాగు పరివాహక ప్రాంతాలు బ్రాహ్మణకొత్తపల్లి, మధనతుర్తి, మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం గ్రామాల నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నదని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెండు రోజుల క్రితం దుర్గాభవానీతండా సమీపంలోని పీన్యాతండా ఆకేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి కిందపడిపోయిందని, గాయాలైన డ్రైవర్‌ను దవాఖానకు తరలించారని అన్నారు. ఇటీవల బ్రాహ్మణకొత్తపల్లిలో రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టిందన్నారు. ఇలా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ఇసుకదందాకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. రాత్రి సమయంలో ఇసుక రవాణాతో ప్రమాదాలు జరుగుతున్నాయని 100 డయల్ చేసినా పట్టించుకునే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ పోరాటాలు చేస్తుందని, డీఎస్పీకి, ఎస్పీకీ ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేశ్, శ్రీరామగిరి సొసైటీ వైస్‌చైర్మన్ భోజ్యానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు అనిల్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

డీఎంహెచ్‌వో కళావతిబాయి

మహబూబాబాద్, మే20: జిల్లాలోని అన్ని దవాఖానలు, ప్రాథమిక వైద్య సెంటర్లు, సబ్ సెంటర్లకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో కళావతిబాయి అధికారులు, వైద్యులను ఆదేశించారు. సోమవారం ఆమె కంబాలపల్లి, ఈదులపూసపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. 12వారాల్లోపు గర్భిణుల పేర్లను సంబంధిత దవాఖానల్లో నమోదు చేయాలన్నారు. మొదటి, రెండు పరీక్షలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మూడు, నాలుగు పరీక్షలు జిల్లాలోని ప్రధాన దవాఖానల్లో నిపుణులైన వైద్యులతో చేయించాలని సూచించారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సౌజన్య, ఆరోగ్య కార్యకర్త గోవిందమ్మ, సరిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దవాఖాన సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

బీజేపీని ఓడించబోతున్నాం : సీపీఐ

మహబూబాబాద్, మే 20 : దేశంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీని ఓడించబోతున్నామని సీపీఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు విజయ్‌సారథి అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రం శివారు శనిగపురంలో మే డే ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. దేశ పాలకులు కార్పొరేట్లకే ఊడిగం చేస్తున్నారని, కార్మికుల చట్టాలను మోదీ కాలరాసినట్లు తెలిపారు. మేడే ఉత్సవాల్లో భాగంగా శనిగపురంలో ఏర్పాటు చేసిన సీపీఐ జెండాను పడాల దేవయ్య ఎగరేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల వీరన్న, చిట్టిమల్ల రాంచంద్రు, సీపీఐ అర్బన్ కార్యదర్శి పెరుగు కుమార్, గ్రామ కార్యదర్శి వీరమల్ల రవీంద్రయ్య, గంట వెంకన్న, లచ్చయ్య, అబ్దుల్లా, సారయ్య, సైదులు, రమేశ్, బాలరాజు, రాంజీ, బావుసింగ్, రవి, శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు విజయ్‌సారథి

శంకర్‌నాయక్ ప్రజల మనిషి

నెల్లికుదురు: కేక్ కట్‌చేస్తున్న ఎంపీపీ, నాయకులు

మహబూబాబాద్: అన్నదానం చేస్తున్న ఫరీద్

మహబూబాబాద్, మే 20 : మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రజల మనిషని 27వ వార్డు కౌన్సిలర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్ అన్నారు. సోమవారం శంకర్‌నాయక్ పుట్టినరోజు సందర్భంగా 27వ వార్డులో ఫరీద్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అక్కినపల్లి ఈశ్వర్, సట్ల రాజు, నిమ్మల వేణు, బోనగిరి శేఖర్, నీలం యాదగిరి, నెమలికళ్ల రాజేశ్, దుగ్గి కార్తీక్, భూపతి, ఆలేటి సాయి, చిన్నబోయిన మధు, ఎల్లబోయిన మహేశ్, రేపాలకుల రమేశ్, సట్ల స్వాగత్, తేజ పాల్గొన్నారు.

కేసముద్రంలో జన్మదిన వేడుకలు

కేసముద్రం: మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలను పార్టీ మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కమటం శ్రీనివాస్, మోడం రవీందర్ గౌడ్, లింగాల పిచ్చయ్య, కొమురయ్య, సంకపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము రాహుల్, కూన భద్రాద్రి పాల్గొన్నారు.

నెల్లికుదురులో..

నెల్లికుదురు: మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేశ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బత్తిని అనిల్, మాజీ సర్పంచ్‌లు కొమ్ము అనిల్, బానోత్ భీముడు, బిక్కూనాయక్, సొసైటీ వైస్ చైర్మన్ బాలాజీనాయక్, నాయకులు భూక్యా బాలాజీనాయక్, కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, పులి రామచంద్రు, గొట్టి ముక్కల ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకల్లో పలువురు బీఆర్ఎస్ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి మరియన్న

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి

మహబూబాబాద్ రూరల్, మే 20 : జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న రైతులకు సూచించారు. సోమవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు స్థిరమైన ఆదాయం సుమారు ఎకరాకు లక్ష రూపాయాలు వస్తుందన్నారు. మొక్కలు నాటిన 4 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు ఆదాయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీనారాయణ, శోభన్ బాబు, నరేందర్ పాల్గొన్నారు.

వేగవంతంగా పనులు పూర్తి చేయాలి

పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సిలార్ సాహెబ్, అధికారులు

తొర్రూరు, మే 20 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం మంజూరు చేసిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో సిలార్ సాహెబ్ సూచించారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి పనులను పరిశీలించి మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, హెచ్‌లు జూన్ ఒకటిలోపు పనులను పూర్తి చేయించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూరి చేయాలన్నారు. ఎంపీడీవోతోపాటు మండల నోడల్ ప్రధానోపాధ్యాయులు బుచ్చయ్య, ఏపీఎం సంజీవరావు కలిసి అమర్‌సింగ్ తండా, కర్రెబీక్యాతండా, కేవ్లా తండా, కర్కాల, వెంకటాపురం పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు.

ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వాలి

కేసముద్రం, మే 20: రెవెన్యూపరంగా అత్యధిక ఆదాయం పొందుతున్న కేసముద్రం రైల్వే స్టేషన్‌లో ఇంటర్‌సిటీ, మణుగూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని సోమవారం పార్టీ నాయకులు కేసముద్రంలోని రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. కేసముద్రం రైల్వేస్టేషన్ నుంచి కేసముద్రం మండల ప్రజలే కాకుండా నెక్కొండ, గూడూరు, నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాల ప్రజలు నిత్యం పట్టణాలకు వెళ్తుంటారని, రైళ్ల హాల్టింగ్ లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కేసముద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. రావుల మురళి, గుగులోత్ వీరూనాయక్, మార్తినేని పాపారావు, శేఖర్, అల్లం నాగేశ్వర్‌రావు, జున్నుతుల దేవేందర్‌రెడ్డి, బండారు దయాకర్, చిదురాల వసంతరావు, బనిశెట్టి వెంకటేశ్, భూలోక్‌రెడ్డి, పోలెపల్లి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

బాలికకు వివాహం చేసిన వారిపై కేసు

నెల్లికుదురు, మే 20: మైనర్‌కు వివాహం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రత్తిరాంతండాలో ఓ బాలికకు ఈ నెల 17న వివాహం చేశారనే పక్కా సమాచారంతో అధికారులు విచారణ చేపట్టగా, మైనర్‌కు వివాహం చేసినట్లు తెలింది. బాలికకు వివాహం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరీ ఫిర్యాదు మేరకు వివాహం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీపీ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

తొర్రూరు, మే 20: రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13వేల గ్రామ పంచాయతీల్లో 60వేల మంది సిబ్బంది పని చేసున్నారని, వారికి వెంటనే వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రికి ఐదారు నెలలుగా జీతాలు రాని జీపీ సిబ్బంది బాధలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గ్రామాల్లో కోట్లాది మంది ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న జీపీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా ఎందుకు గుర్తించడం లేదన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీకు, మండల అధ్యక్షుడు సోమనర్సయ్య, మండల ఉపాధ్యక్షుడు ప్రమోద్, నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

ఇనుగుర్తి, మే 20 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అయ్యగారిపల్లిలోని సబ్ సెంటర్‌ను సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష్, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ క్రిష్ణార్జున ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందికి సమయపాలన పాటించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.సురేశ్, హెచ్‌ఈవో భిక్షపతి, ఎస్ఎన్‌వో హరిత, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సూర్యప్రకాశ్

మహబూబాబాద్, మే 20 : నూతన విద్యా సంవత్సరం నుంచి ప్రైవేట్ స్కూళ్ల ఆర్థిక దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గుగులోత్ సూర్యప్రకాశ్ అధికారులను కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేసి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీ హద్దులు లేవన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరిట జలగల్లా పట్టి పీడీఇస్తున్నారని అన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి టీసీ, స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్ల కోసం పెద్ద మొత్తంలో వసూలు చేస్